ఉత్సాహంగా గడపగడపకు

పోలవరం రూరల్ : జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని పాత కుంకాల, కొత్తకుంకాల, రెడ్డికుంకాల, ముత్యాలరావు పేట, జిల్లెళ్లగూడెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారికి అందిన లబ్ధికి సంబంధించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సమకూరాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాలల్లో విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి మండల ఉపాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ కోటం గంగాదేవి మండల ఉపాధ్యక్షులు మిడియం సింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు, కలుం బుల్లబ్బాయి. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిపై హర్షం

జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి కుటుంబం ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని లక్కవరంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని అన్నారు. పరిష్కారం కాని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలనను అందిస్తున్నారన్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలను రాష్ట్ర ప్రజలంతా కొనియాడుతుంటే పవన్‌కళ్యాణ్ వలంటీర్లను దండుపాళ్యం అనడం దారుణమన్నారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సొసైటీ చైర్మన్ బడి దుర్గారావు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, పార్టీ నాయకులు నిమ్మ రామకృష్ణ, చిల్ల దుర్గారెడ్డి, దల్లి నాగేశ్వరరావు, వందనపు సూర్యప్రకాషరావు, చిట్టిబొమ్మ శివ రామకృష్ణ, జీరి పాపారావు, మల్లెల్లి సూరి, పంది సుబ్బరాజు, మరీదు బుల్లిరాజు పాల్గొన్నారు.



పోలవరం రూరల్ : సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



జంగారెడ్డిగూడెం రూరల్ : సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కామవరపుకోట : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తడికలపూడి గ్రామానికి చెందిన మాడపాటి గణేష్‌కు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తడికలపూడి శాఖ ఆధ్వర్యంలో సోమవారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్సై ఎం.విజయబాబు చేతులమీదుగా బాధితునికి అందజేశారు. మానవత సభ్యులు కె.గంగాధర్ ప్రసాద్, ఎన్.కాంతారావు, కోలా శ్రీనివాస్, నెక్కలపూడి సురేష్ , కె.సురేష్ గుప్తా, వంగపండు శ్రీనివాసరావు, ఎం.బాబీ, కె.మాణిక్యాలరావు, కమలాకర్, బొర్రా శ్రీనివాస్, కె.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కొత్తగూడెంలో పోలీస్ పహరా

టి.నరసాపురం : అల్లంచర్లరాజుపాలెం పంచాయతీ కొత్తగూడెం గ్రామంలో సోమవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ గ్రామంలోని వివాదాస్పద భూమిలో తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు పహరా ఏర్పాటు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఏఎస్‌ఐ మాధవరెడ్డి, కానిస్టేబుల్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి చక్కటి వేదిక



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి : కేసుల రాజీకి లోక్‌అదాలత్ చక్కటి పరిష్కార మార్గమని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సి మధుబాబు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీస్, ఎక్సైజ్ అధికారులతో లోక్‌అదాలత్‌పై సమీక్ష జరిపారు. చింతలపూడి కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ , కుటుంబ తగాదా, సివిల్ కేసులను పరిష్కరించుకునేలా కక్షదారులకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఏపీపీ సామయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులకు కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల జట్టులను పరిచయం చేస్తున్న ఎస్సై చెన్నారావు

లింగపాలెం : ఆగస్టు 15 సందర్భంగా ధర్మాజీగూడెం ప్రతిభా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన హైస్కూల్ స్థాయి విద్యార్థుల కబడ్డీ పోటీలను ఎస్సై పి చెన్నారావు ప్రారంభించారు. ఈపోటీలలో ధర్మాజీగూడెం, లింగపాలెం గ్రామాలలోని హైస్కూల్స్‌కు చెందిన 10 టీంలు పాల్గొన్నాయి. ధర్మాజీగూడెం హోలీట్రినిటి, స్థానిక ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. ప్రతిభా కళాశాల కరెస్పాండెంట్ సుజాత కుమారి, ప్రిన్సిపాల్ రత్నాకరరావు, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై ఖండన

కొయ్యలగూడెం : ఏలూరు జిల్లా కదిలిండి మండలం సానారుద్రవరంలో దుండగులు వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని కొయ్యలగూడెం మండల, పట్టణ కాపు సేవా సంఘాల అధ్యక్షులు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వం దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మండల అధ్యక్షుడు మంచాల వెంకయ్య నాయుడు, పట్టణశాఖ అధ్యక్షుడు దుగ్గిన శ్రీనివాస్ కోరారు.

దేశ సమగ్రతకు పాటుపడాలి

కామవరపుకోట : ప్రతి ఒక్కరూ దేశ సమగ్రతకు పాటుపడాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా సోమవారం కళ్ళచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రవిబాబు ఆధ్వర్యంలో, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఎస్‌కే సుభాని దేశభక్తి గేయాలను ఆలపించారు. గ్రామ సర్పంచ్ ఎస్.సత్తిబాబు, ఆడమిల్లి సర్పంచ్ కేశవరావు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు



బయ్యనగూడెంలో విద్యార్థుల ర్యాలీ

కొయ్యలగూడెం : పంద్రాగస్టు పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని బయ్యనగూడెంలో త్రివర్ణ పతాకంతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జ్యోతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు స్వాతంత్ర సమర యోధుల వేషధారణలతో ఆకట్టుకున్నారు.

రూ.1.40 కోట్లతో మంచినీటి ట్యాంక్ నిర్మిస్తాం

ఎంపీ కోటగిరి శ్రీధర్

జంగారెడ్డిగూడెం: స్థానిక ఉప్పలమెట్టలో రూ.1.40 కోట్లతో 10 లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ నిర్మిస్తామని ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండాకాలంతో పాటు, పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడిపై స్థానిక నాయకులు, కౌన్సిలర్‌లు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. మంచినీటి సమస్యల పరిష్కారానికి ఎంపీ లాడ్స్, 14వ ఫైనాన్స్ నిధులతో వాటర్ ట్యాంక్ నిర్మిస్తానన్నారు. ఈ ట్యాంకు ద్వారా పట్టణంలోని 10వేల మందికి మంచినీటి అవసరాలు తీరతాయన్నారు. వెంటనే శంకుస్థాపన చేసి రెండు మూడు నెలల్లో మంచినీటి ట్యాంక్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి సోంబాబు, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, మేడవరపు అశోక్, మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన వినతుల పరిష్కారానికి కృషి



ఐటీడీఏలో సమస్యలు వింటున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏలో జరుగుతున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పలు వినతులను స్వీకరించారు. వీటిలో వేలేరుపాడు మండలంకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్, భూ సమస్యల మీదే వచ్చాయి. ఆర్‌అండ్‌ఆర్ భూమికి సంబంధించి తమకు పరిహారం అందించాలని మునిగెల చిన్నక్క వినతి పత్రాన్ని అందజేయగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 18 ఏళ్లు నిండిన వారికి కూడా ఇవ్వాలని పునుగుపాటి పావని పీఓ దృష్టికి తీసుకువచ్చింది. వీటితోపాటు సుమారు 14 మంది పలు సమస్యలను పీఓ దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని పీవో హామీ ఇచ్చారు.

ఉద్యోగాలకు 22 మంది ఎంపిక

కేఆర్‌పురం ఐటీడీఏలో సోమవారం గిరిజన యువతీ యువకులకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ, కాడ్బరీ చాక్లెట్ తయారీ కంపెనీలో పనిచేయడానికి అర్హులైన వారిని 22 మందిని ఎంపిక చేసినట్లు పీఓ ఎం. సూర్యతేజ తెలిపారు. వారికి ఎంపిక పత్రాలను అందజేశారు. ప్రతినెలా ఉద్యోగ మేళా, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీడీ పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ ఎం.నాగేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు, వైపీ ప్రవీణ్, రామకృష్ణ, కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి

జంగారెడ్డిగూడెం : స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి అన్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజలు నుంచి వినతులు స్వీకరించారు. స్పందనలో మొత్తం 17 అర్జీలు అందాయని ఆమె తెలిపారు. ఇందులో అధికంగా భూ సమస్యలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయన్నారు.

డిగ్రీ కళాశాల ఆకస్మిక తనిఖీ



డిగ్రీ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కృష్ణ

బుట్టాయగూడెం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కలాశాలను కళాశాల విద్యా ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.కృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను బోధనా విధానంపై అడిగి తెలుసుకున్నారు. అలాగే సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాత్కాలిక కళాశాల భవనాన్ని పరిశీలించి సౌకర్యాలు మెరుగు పరిచిన విధానం బాగుందని అభినందించారు. అనంతరం కళాశాల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి కళాశాలల్లో నూతనంగా నాలుగేళ్ల ఆనర్స్ కోర్స్‌లు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. అధ్యాపకులు ఎప్పటికప్పుడు పనితీరు మెరుగుపరచుకోవాలని అన్నారు. అలాగే కళాశాలలో ఉన్న కంప్యూటర్ సెంటర్, లైబ్రరీలను పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మునీంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ మత్రి వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అక్కులన్న, అధ్యాపకులు శ్రీలక్ష్మి, సునీత, భాగ్యలక్ష్మి, శ్రీను, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా యడ్లపల్లి రాధిక ఏకగ్రీవం



నియామక పత్రం అందుకుంటున్న రాధిక

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని శ్రీనివాసపురం సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. 4 నామినేషన్లు దాఖలు కాగా సోమవారం జొన్నకూటి శ్రీనివాసరావు, తడికల మోహనరావు, యడ్లపల్లి సత్యవతి తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో సర్పంచ్‌గా యడ్లపల్లి రాధిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేష్ నియామక పత్రాన్ని అందజేశారు. సర్పంచ్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో యడ్లపల్లి దుర్గారావు మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఏకగ్రీవానికి అన్ని పార్టీలు సహకరించి రాధికను సర్పంచ్‌గా ఎన్నుకున్నాయి.

ఏకగ్రీవంగా పాల వెంకటేశ్వరరావు ఎన్నిక



డిక్లరేషన్ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యామసుందర్

కామవరపుకోట : వీరిశెట్టిగూడెం గ్రామపంచాయతీ మూడో వార్డు సభ్యుడు పాలా కోటేశ్వరరావు మృతి చెందటంతో ఆ వార్డు ఎంపికకు వైఎస్సార్ సీపీ నుంచి పాలావెంకటేశ్వరరావు, టీడీపీ నుంచి కొప్పిసెట్టి నరసింహారావు నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం నరసింహారావు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో పాల వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యామసుందర డిక్లరేషన్ పత్రాన్ని అందజేశారు.

ఎడ్లబండిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం



ఘటనా స్థలంలో గాయాలతో పడి ఉన్న ఎద్దు

జంగారెడ్డిగూడెం రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తికి, రెండు ఎద్దులకు తీవ్ర గాయాలైన ఘటన తాడువాయిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడువాయి కి చెందిన కలపాల రామకృష్ణ తన ఎండ్ల బండితో సోమవారం వేకువజామున జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో కాలువ వద్దకు ఇసుక తెచ్చుకునేందుకు బయలుదేరాడు. గుర్తు తెలియని వాహనం ఎడ్ల బండిని తాడువాయి దాబా హోటల్ సమీపంలో ఢీకొట్టింది. దీంతో రామకృష్ణకు స్వల్పగాయాలు కావడంతో అతడిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనలో రెండు ఎద్దులకు గాయాలుకాగా ఒక ఎద్దు తీవ్రంగా గాయపడింది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్‌బాబు తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం కండ్రికగూడెం సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. అదేవిధంగా వారి వద్ద నుంచి రూ. 5200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. అలాగే వీరి వద్ద నుంచి రూ. 2200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎన్నికల గుర్తులొచ్చేశాయ్..

ద్వారకాతిరుమల: పంచాయితీ వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో భాగంగా పోటీచేసే అభ్యర్థులకు సోమవారం గుర్తులను కేటాయించారు. దీంతో రాత్రి నుంచే ఎన్నికల ప్రచారం మొదలైంది. ద్వారకాతిరుమలలోని 8వ వార్డుకు దాఖలైన ఎనిమిది నామినేషన్లలో, ఐదు నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకున్నారు. మిగిలిన ముగ్గురిలో చిలుకూరి చంద్రంకు ప్రెషర్ కుక్కర్, పెద్దింటి నాగేశ్వరరావుకు గౌను, నడికట్టి సీతారామాంజనేయులుకు స్టూలు గుర్తులను కేటాయించారు. అలాగే గుణ్ణంపల్లిలోని 6వ వార్డుకి నామినేషన్లు దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. అందులో భాగంగా ముసల నాగ రేణుకకు గౌను, సర్నాల వెంకటలక్ష్మికి స్టూలు, కేసిరెడ్డి శ్రీదేవికి ప్రెషర్ కుక్కర్ గుర్తులను కేటాయించారు. ఈనెల 19న పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.

కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల నిరసన

కొయ్యలగూడెం : సకాలంలో జీతాలు చెల్లించాలంటూ కాంట్రాక్టు విద్యుత్తు ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. గణేష్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కొయ్యలగూడెం సబ్ డివిజన్ పరిధిలోని కాంట్రాక్టు మీటర్ రీడర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు. కాంట్రాక్టర్ వేతనాలను సకాలంలో వేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీనిపై ఏలూరులో ఎలక్ట్రికల్ ఎస్ఈకి ఫిర్యాదు చేయనున్నామని పేర్కొన్నారు.

డీఎస్పీ ధనుంజయుడికి అభినందనలు



డీఎస్పీకి పుష్పగుచ్ఛం ఇచ్చి సీఐ రాజేష్ అభినందనలు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడుని పలువురు పోలీసు అధికారులు అభినందించారు. డీఎస్పీ ధనుంజయుడుకి కేంద్ర హోంమంత్రి పతకం లభించిన సందర్భంగా జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్సై ఎం.సాగర్‌బాబు, ఏఎస్సైలు సుబ్బారావు, సోంబాబు, జ్యోతిరాణి, ఎస్‌బీ సంపత్‌కుమార్, రైటర్ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది శ్రీనివాసరావు, రమేష్, రామాంజనేయులు, రవికుమార్, భీమశంకరం, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

వెంకయ్య ఆలయం వద్ద నిరసనలు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెంలోని కన్నాపురం రోడ్డులో తహసిల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గొలగమూడి వెంకయ్య అవధూత స్వామి ఆలయం వద్ద రెండు వర్గాల వారు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల ఆలయ పాలకమండలి ఏర్పాటు విషయంలో నెలకొన్న వివాదాల నేపథ్యంలో నాలుగు రోజులుగా ఆలయంలో ధూప దీప నైవేద్యాలు అమలు కావడం లేదని ఒక వర్గం వారు ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో వేరొక వర్గం వారు తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

రాజుకున్న భూతగాదాలు

కొయ్యలగూడెం : గిరిజన గిరిజనేతరుల మధ్య భూతగాదాలు మళ్లీ రాజుకున్నాయి. సోమవారం సరిపల్లి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామమైన వంకాబొత్తప్పగూడెం గ్రామంలోని కొందరు గిరిజనేతరుల రైతులకు చెందిన పొలాలలో గిరిజనులు ఎర్రజెండాలు పాతడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. దిప్పకాయలపాడు గ్రామంతో సహా పరిసర గ్రామాలకు చెందిన సుమారు 15 మంది గిరిజనేతరులకు చెందిన దాదాపు 70 ఎకరాల వ్యవసాయ భూమిలో 100 మందికి పైగా గిరిజనులు వచ్చి ఎర్రజెండాలను పాతడంతో వివాదం నెలకొంది. దీంతో గిరిజనేతర రైతులు తహసిల్దార్ కార్యాలయంలో సామూహికంగా వచ్చి తహసీల్దార్ పాసం నాగమణికి ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే

చింతలపూడి : మండలంలోని యర్రగుంటపల్లి, గణిజర్ల గ్రామాలను జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కోసం ఎంపిక చేసినట్లు ఎఫ్‌హెచ్‌ఎస్ జిల్లా నోడల్ అధికారి కె శ్రీనివాసరావు తెలిపారు. యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంతో పాటు క్షయవ్యాధి, ఎయిడ్స్, కుష్టు వంటి వ్యాధిగ్రస్తులను ఈ బృందం కలుసుకుని వారికి అందుతున్న సేవలను గురించి వివరాలు సేకరించి కేంద్ర బృందానికి నివేదిస్తారన్నారు. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సర్వే బృందం ఊటసముద్రం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు.

ఎస్సీ రైతులకు కిట్ల పంపిణీ

చింతలపూడి: ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే ప్రోత్సాహకాల కిట్‌లను సోమవారం పోతునూరు సర్పంచ్ కందుల లక్ష్మీ ప్రసన్న పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గోవర్ధనరెడ్డితో కలిసి అందచేశారు.